

సోనియాగాంధీతో ఎమ్మెల్యే వీర్లపల్లి

సోనియా, రాహుల్‌ను కలిసిన ఎమ్మెల్యే వీర్లపల్లి

షాద్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఢిల్లీలో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఢిల్లీలో జంతర్‌మంత్ వద్ద బీసీ బిల్లుకు ఆమోదం తెలుపాలంటూ కాంగ్రెస్ నేతలు ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. ధర్నా ముగిసిన మరునటి రోజు గురువారం ఉదయం న్యూఢిల్లీలో సోనియాగాంధీ, రాహుల్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ అగ్రనేతలను కలిసిన వారిలో తెలంగాణకు చెందిన మంత్రులు, ఇతర నేతలు ఉన్నప్పటికీ సోనియా, రాహుల్ గాంధీ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. వీర్లపల్లికి రాహుల్‌గాంధీ షేక్ హ్యాండ్ ఇచ్చిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మంత్రివర్గంలో చోటు ఖాయమని షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు ధీమాతో ఉన్నారు.

విత్తన పండుగకు ఎర్త్ సెంటర్ సిద్ధం

- నేటి ప్రారంభ వేడుకలకు మంత్రి తుమ్మల రాక

కడ్తాల్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి విత్తనాల పండుగకు కడ్తాల మండలం అన్మాస్‌పల్లి ది ఎర్త్ సెంటర్ ముస్తాబైంది. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, భారత బీజ్ స్వరాజ్ మంచు సంయుక్త ఆధ్వర్యంలో విత్తనాల పండుగ కార్యక్రమాన్ని దేశంలో తొలిసారిగా నిర్వహిస్తున్నారు. ఈనెల 4 నుంచి 6వ తేది వరకు కొనసాగే విత్తన పండుగకు సీజీఆర్ ప్రతినిధులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. గురువారం ఏర్పాట్లను సీజీఆర్ సంస్థ అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డి పరిశీలించారు. ప్రారంభ కార్యక్రమానికి శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరవుతారని తెలిపారు. సంస్థ ఫౌండర్ కోర్బేలు లక్ష్మారెడ్డి, పబ్లిక్ పాలసీ ఎక్స్‌పర్ట్ దొంతి నర్సింహ్మారెడ్డి, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

కొడంగల్ : పిడుగుపాటుకు భాజాఅహ్మద్‌పల్లిలో మృతి చెందిన జీవాలు



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గురువారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సాయంత్రం నుంచి తెరపిలేకుండా వర్షం కురుస్తూనే ఉంది. ప్రధానంగా నగర శివారు ప్రాంతాల్లో కుండపోతగా కురిసింది. తీవ్రమైన ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు అకాల వర్షాలకు ఊరట చెందారు. అత్యధికంగా రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో 89.5 మి.మీ వర్షపాతం నమోదైంది. పలు చోట్ల గాలివానతో పాటు పిడుగులు బీభత్సాన్ని సృష్టించాయి. అనేక చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. పలుచోట్ల పంటలు నీటమునిగాయి. రేపు, ఎల్లుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వికారాబాద్ కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

దంచికొట్టిన వాన



పరిగి : చౌడాపూర్‌లో కురుస్తున్న వడగళ్ల వాన, ఇన్‌సెట్‌లో నేలకొరిగిన వరిపంట

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం

- నీట మునిగిన పంట పొలాలు
- పిడుగుపాటుకు కొడంగల్‌లో 30 జీవాలు మృతి
- అత్యధికంగా సరూర్‌నగర్‌లో 89.5మి.మీ వర్షపాతం నమోదు
- ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం
- మరో మూడు రోజుల పాటు భారీ వర్ష సూచన

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి రోడ్లపై వరద ఏరులై ప్రవహించింది. పిడుగుపాటుకు వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం ఖాజాఅహ్మద్‌పల్లిలో పకీరప్ప అనే రైతుకు చెందిన 13 మేకలు, 12 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం సింగాపూర్‌లో పిడుగుపాటు గేదె మృతి చెందగా రైతుకు స్వల్ప గాయాలయ్యాయి. భారీ వర్షాలకు అనేక చోట్ల పంట నష్టం జరిగింది. కందుకూరు కొత్తవాడలో చామగడ్డ పంట నీట మునిగింది. అనేక చోట్ల కూరగాయపంటలకు నష్టం వాటిల్లింది. ఇంకా పలు చోట్ల అర్ధరాత్రి వరకు వర్షాలు కురుస్తూనే ఉండడంతో పంట నష్టం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. భూగర్భజలాలు అడుగంటి అనేక చోట్ల ప్రజలు తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్న సమయంలో ఇప్పుడు కురుస్తున్న వర్షాలు ఊరట కలిగించాయి. ఇపుడు కురుస్తున్న వర్షాలకు భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు సంబరపడుతున్నారు. మూసీలో వరదనీరు పరవళ్ల తొక్కింది. ఇదిలా ఉంటే మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ సూచించింది. రంగారెడ్డి , మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది.



మహేశ్వరం : కొత్తవాడలో చామగడ్డ చేనులో వరదనీరు

వికారాబాద్ కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం
ఫోన్ నంబర్ - 7995061192

వికారాబాద్/మేడ్చల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఈదురుగాలులతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జిల్లాలో పలుచోట్ల చెట్లు విరిగిపడి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. వికారాబాద్, తాండూరు, పరిగి ప్రాంతాల్లో సరఫరాలో పలుమార్లు అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉంటే, జిల్లాలో భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూంలో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో వర్షాలతో ఏ సమస్య ఏర్పడినా 7995061192 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు.

దిస్ నంబర్ డస్‌నాట్ ఎగ్జిస్ట్...

ఇదిలా ఉంటే, వర్షాలు కురిసే ప్రాంతాల్లో సహాయక

మిగతా 7వ పేజీలో...



రంగారెడ్డి జిల్లా చౌదరిగూడలో కురుస్తున్న వర్షం

వర్షపాతం వివరాలు (మి.మీలలో)

రంగారెడ్డి జిల్లా:	
ఎల్‌బీనగర్	76.3
చంపాపేట్	72.3
ఇబ్రహీంపట్నం	51.3
కందుకూరు	46.5
మేడ్చల్ జిల్లా:	
బాలానగర్	77.5
అల్వాల్	72.5
ముసారాంబాగ్	67.0
రామంతాపూర్	55.5
ఉప్పల్	55.3
మల్కాజిగిరి	51.5
వికారాబాద్ జిల్లా:	
చౌడాపూర్	48.5
కుల్కచర్ల	46.0
కొడంగల్	35.5
ముజాహిద్‌పూర్	30.5
దౌల్తాబాద్	30.3
బషీరాబాద్	26.0
కాశీంపూర్	26.0
రాపోల్	22.5



సభలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

బీసీ బిల్లు పేరుతో డైవర్షన్ రాజకీయాలు

కాంగ్రెస్‌పై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

- రాహుల్‌నే ఒప్పించలేని సీఎం రేవంత్.. కేంద్రాన్ని ఒప్పిస్తాడని నమ్మేదెలా
- ఢిల్లీలో ధర్నా చేపడితే ముఖం చాటేసిన రాహుల్
- కేసీఆర్ జీడీపీ పెంచితే.. రేవంత్ గూండాయిజం పెంచాడు
- రేవంత్ తీరుతో సీఎం కుర్చీకి విలువ లేకుండా పోయింది
- పౌరుషం ఉంటే రుణమాఫీపై బహిరంగ చర్చకు రావాలి
- బీఆర్‌ఎస్ నేత సవాల్

ఆమనగల్లు, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించిన బీసీల రిజర్వేషన్‌ల పెంపు బిల్లు పార్లమెంట్‌లో ఆమోదానికి సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి పోయి ధర్నా చేపడితే ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ముఖం చాటేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. రాహుల్‌నే ఒప్పించి ధర్నాకు తీసుకురాని రేవంత్... కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పిస్తారంటే ఎలా నమ్మాలని ఆయన ప్రశ్నించారు. కడ్తాల మండలంలో గురువారం హరీశ్ రావు పర్యటించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి లతో కలిసి ఎక్వాయిపల్లి, మర్రిపల్లి, ముద్విన్ గ్రామాలలో బీఆర్‌ఎస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అలాగే ముద్విన్ గ్రామంలో జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో

మిగతా 8వ పేజీలో...



బోయిన్ గుట్టతండా సభలో ప్రజలు

పరీక్షలు, స్కానింగ్ పేరిట నిలువు దోపిడీ



అర్హత గల వైద్యుల సర్టిఫికెట్లతో ఆస్పత్రుల నిర్వహణ ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులు



షాద్‌నగర్‌లో శంకర్‌దాదాలు!

వచ్చీరాని వైద్యంతో ఆర్‌ఎంపీల దందా

షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఆర్‌ఎంపీలు వచ్చీరాని వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అమాయకులే టార్గెట్‌గా దోపిడీ పర్వానికి తెరలేపారు. పేదల ఆరోగ్య అవసరాలను ఆసరాగా చేసుకొని అర్హత లేకున్నా వైద్యం చేస్తున్నారు. కొందరు ఆర్‌ఎంపీలైతే పేద, ధనిక అనే తేడా లేకుండా టెస్టులు, స్కానింగ్‌లు, ఎంఆర్‌ఐలు, మందుల పేరిట విచ్చలవిడిగా దోచేస్తున్నారు. షాద్‌నగర్ పట్టణంలో కనిపించే వారంతా గ్రామీణ చిన్నాచితక వైద్యులే. వారిదెబ్బకు అర్హత, నిష్ణాతులైన వైద్యులు కూడా విలవిల్లాడుతున్నారు. ఆర్‌ఎంపీలు ఇబ్బడిముబ్బడిగా క్లినిక్‌లు, ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నా వైద్యాధికారులు ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

షాద్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత రోజుల్లో వైద్యం ఒక దందాగా మారింది. అర్హతలేని ఆర్‌ఎంపీలు ప్రైవేటు వైద్య రంగాన్ని శాసించడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండి అత్యవసర సమయంలో ప్రథమ చికిత్సలు చేసే ఆర్‌ఎంపీలు పట్టణ ప్రాంతాలకు వచ్చి డాక్టర్ల పేరిట ఆస్పత్రులు, క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. అర్హత లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా చికిత్సలు చేస్తున్నారు. కొంతమంది తమ పరిధి దాటిన రోగులను ప్రభుత్వ ఆస్పత్రులకు కాకుండా ప్రైవేటు ఆస్పత్రులకు సిఫారసు చేస్తున్నారు. ఇక ప్రైవేటు వైద్యులు ఆర్‌ఎంపీలకు ఇచ్చే కమిషన్‌తో సహా మొత్తం సొమ్మును రోగుల నుంచి వసూలు చేస్తున్నారు.

ఆస్పత్రులు వారివే..

సాధారణంగా అర్హత ఉన్న వైద్యులు ఆస్పత్రుల నిర్వహణ కోసం స్థానిక డిప్యూటీ డీఎంహెచ్‌వోకు దరఖాస్తు చేసుకోవాలి. ఆ



దరఖాస్తును డీఎంహెచ్‌వో జిల్లా ఉన్నత వైద్య అధికారులకు సమర్పిస్తారు. సదరు అధికారులు దరఖాస్తు చేసుకున్న ఆస్పత్రులను పూర్తిగా పరిశీలించాలి. దరఖాస్తులకు అనుగుణంగా వైద్య పరికరాలు ఉన్నాయా? లేదా అని పరిశీలించి జిల్లా వైద్య అధికారులకు నివేదిక అందజేస్తారు. అయితే కొంతమంది ఆర్‌ఎంపీ వైద్యులు అర్హత గల వైద్యుల పేరు మీద షాద్‌నగర్ నియోజకవర్గంలో ప్రైవేటు ఆస్పత్రులను నిర్వహిస్తున్నారు. ఎవరైతే ఆస్పత్రుల నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకున్నారో ఆ వైద్యులు అందుబాటులో ఉండరు. వారు నామమాత్రంగా

మిగతా 8వ పేజీలో...

అర్హత లేకుండా వైద్యం చేస్తే చర్యలు



అనుభవం లేని వైద్యులు పరిమితికి మించి వైద్యం చేయరాదు. ఆర్‌ఎంపీ వైద్యులు ఆస్పత్రులు, క్లినిక్‌లు నిర్వహించరాదు. ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. అనుమతులు తీసుకున్న అర్హత కలిగిన వైద్యులు మాత్రమే ఆస్పత్రుల్లో ఉండాలి. వారి స్థానంలో ఇతరులుంటే ఆస్పత్రులను సీజ్ చేస్తాం. రోగులను ప్రభుత్వ ఆస్పత్రులకు మాత్రమే సిఫారసు చేయాలి.

డాక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో

దక్షిణ తెలంగాణ అభివృద్ధిని ఓర్వలేకపోతున్నారు

- అందుకే విషం కక్కుతున్న బీఆర్‌ఎస్ నాయకులు
- టీపీసీసీ సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనలో దక్షిణ తెలంగాణ, ఉమ్మడి పాలమూరు జిల్లా వేగవంతంగా అభివృద్ధి జరుగుతుండడం చూసి ఓర్వలేని బీఆర్‌ఎస్ నాయకులు విషం కక్కుతూ కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారని టీపీసీసీ సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, ఆ పార్టీ నేతలు... కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌ను విమర్శించడమే దినచర్యగా పెట్టుకున్నారన్నారు. కడ్తాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అవినీతి కుంభకోణాలు, అరాచక పాలనతో అధికారాన్ని కోల్పోయిన బీఆర్‌ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం కులగణన చేపట్టిందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. హరీశ్ రావు అబద్ధాలతో గిరిజనులను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించి గోర్‌బోలి భాషకు గుర్తింపు ఇవ్వాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. హెచ్‌సీయూ భూములు మున్మాటికి ప్రభుత్వానివేనని, వాటిని ప్రజల కోసం ఉపయోగించాలని చూస్తుంటే.. బీఆర్‌ఎస్ నాయకులు విద్యార్థులను రెచ్చగొట్టి తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు క్యామ రాజేశ్, అశోక్, బోసు రవి, మల్లేశ్ గౌడ్, మంకి శ్రీను, రాంచందర్ నాయక్, శంకర్‌నాయక్, భానుకిరణ్, శ్రీకాంత్, తుల సీరామ్, బుచ్చయ్య, శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లలో ఆదిభట్లకు అవార్డు

ఆదిభట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూళ్లలో ఆదిభట్లను ఉత్తమ అవార్డు వరించింది. గత రెండు ఆర్థిక సంవత్సరాల నుంచి ఆస్తి పన్ను వసూళ్లలో ఆదిభట్ల మున్సిపాలిటీ లక్ష్యాన్ని చేరుకోవడంతో సీడీఎంఏ నీకే శ్రీదేవి చేతులు మీదుగా హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌డీఆర్‌ఐ కార్యాలయంలో కమిషనర్ బాలకృష్ణ ఉత్తమ అవార్డు అందుకున్నారు.



బీజాపూర్ రోడ్డు విస్తరణపై సీఎం స్పందించాలి

బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి



7

నిందితులను త్వరలోనే పట్టుకుంటాం : ఎస్పీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి, సిబ్బంది

పెద్దేముల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మహిళ హత్యకు గురైన ఘటనలో నిందితులను వీలైనంత త్వరగా పట్టుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. పెద్దేముల్ మండల కేంద్రంలో బుధవారం మహిళ హత్యకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ లభించిన ఆధారాలను పరిశీలించారు. దర్యాప్తు పురోగతి గురించి డీఎస్పీ బాలకృష్ణారెడ్డిను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఈ కేసు విషయమై సమగ్ర విచారణ జరుపుతామని, ప్రాథమికంగా మృతురాలిని గుర్తించడంపై దృష్టి పెట్టామని తెలిపారు. దీనికోసం ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. దర్యాప్తును వేగవంతం చేయాలని, క్లూస్‌టీం సహాయంతో శాస్త్రీయ ఆధారాలను సేకరించి అన్ని కోణాల్లో విచారణ చేయాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ ఘటనకు సంబంధించి ఏదైనా సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఎస్పీ వెంట తాండూరు రూరల్ సీఐ నగేష్, ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

జీతాలు చెల్లించాలని ఆందోళన


అలియాబాద్‌లో ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

శామీర్‌పేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా జీతాలు లేక కుటుంబాలను పోషించలేకపోతున్నామని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీతాలను చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ గురువారం శామీర్‌పేట మండలం అలియాబాద్ పంచాయతీ కార్యాలయం ఎదుట 20 మంది కార్మికులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, జీతాలను చెల్లించకపోవడం దారుణమని వాపోయారు.

రైలు ఢీకొని 18 మేకలు మృత్యువాత



షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ శివారులోని సోలీపూర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు ఢీకొని 18 మేకలు మృతి చెందాయి. గద్దం చంద్రయ్య తన మేకలను శుక్రవారం ఉదయం మేపడానికి తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి తోలుకువస్తున్న సమయంలో రైల్వే బ్రిడ్జి దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

అగ్నివీర్‌కు అన్నాదమ్ములు


సైనికులుగా ఎంపికైన యువకులను సన్మానిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

దారూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తరిగోపుల గ్రామానికి చెందిన కుర్వశివ, విష్ణు అగ్నివీర్‌కు సైనికులుగా ఎంపికయ్యారు. వీరిని బీఆర్ఎస్ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్రామిరెడ్డి, శ్రీనివాస్, శ్యామలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

తూంకుంట మున్సిపాలిటీకి ఉత్తమ అవార్డులు


అవార్డులు అందుకుంటున్న కమిషనర్ వెంకటగోపాల్

శామీర్‌పేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నులు 85 శాతం వసూలు చేసినందుకుగాను తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ గురువారం రెండు ఉత్తమ అవార్డులను అందుకున్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలో 2024-25 సంవత్సరానికిగాను 85 శాతానికి పైగా ఇంటి పన్నులు వసూలు చేసినందుకు బెస్ట్ అచీవర్ అవార్డును, అలాగే 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 85 శాతం ఆస్తి పన్నులు, మొత్తం 15.22 కోట్ల లక్ష్యానికి రూ.12.65 కోట్లు వసూలు చేసినందుకు బెస్ట్ కాన్సిస్టెంట్ అచీవర్ అవార్డును అందుకున్నారు. గురువారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ల సమావేశం సందర్భంగా రాష్ట్ర మున్సిపల్ పరిపాలన కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి(ఐఏఎస్), (సీడీఎంఏ) తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్‌ను అభినందిస్తు రెండు ఉత్తమ అవార్డులను అందజేశారు.


దట్టి ప్రదర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అజ్మీర్‌కు బీఆర్‌ఎస్ నేతలు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) మేడ్చల్ పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు రాజస్థాన్ రాష్ట్రంలోని హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గా దర్శించుకుని దట్టి సమర్పించుకోవటానికి బయలు దేరనున్నారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ మైనార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేతులు మీదుగా దర్గాకు సమర్పించే దట్టీని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పట్టణం బీఆర్ఎస్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, మైనార్టీ నాయకుడు మహబూబ్ అలీ, ఎండీ అబేద్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి గురువారం మేడ్చల్ పట్టణంలోని పలు రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బియ్యం పంపిణీని పరిశీలించి పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. రేషన్ దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు.


సారా కేంద్రంపై దాడి చేస్తున్న రేంజర్ రాజేందర్, సిబ్బంది

నాటు సారా తయారీ కేంద్రంపై దాడి

ధారూరు, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): ధారూరు అటవీ రేంజ్ పరిధిలోని సంగాయపల్లి తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ కేంద్రంపై రేంజర్ రాజేందర్, సిబ్బంది దాడి చేశారు. నాటుసారాకు వినియోగిస్తున్న వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించి వికారాబాద్ ఎక్సైజ్ అధికారులకు సమాచారమిచ్చారు. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. అటవీ రేంజర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాలాల మండలం సంగాయపల్లి తండా సమీపంలో గస్తీ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి వాగు నీటిలో నుంచి పారిపోతుండగా అనుమానం వచ్చి వెతికారు. అక్కడ నాటుసారా తయారీ స్థావరం కనిపించింది. పరిశీలించగా జీడి గింజలతో నాటుసారా తయారు చేస్తున్నట్లు ఆనవాళ్లు గుర్తించారు. నాటు సారా కోసం వినియోగించిన సర్వలు, ప్లాస్టిక్ బిందెలు, ప్లాస్టిక్ క్యాన్లు, ఇనుప రాడ్లు స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. నాటు సారా తయారు చేస్తున్న వ్యక్తి నీలిగడ్డ తండావాసిగా అనుమానిస్తున్నామని రేంజర్ తెలిపారు.


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి అనంతరెడ్డి

అణచివేత ధోరణిలో కాంగ్రెస్ ప్రభుత్వం

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేతలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి అనంతరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. గురువారం మొయినాబాద్‌లో పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో విద్యాసంస్థలకు చెందిన 400 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టడం అన్యాయమన్నారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్‌గాంధీకి హెచ్‌సీయూలో జరుగుతున్న అరాచకం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కొత్త నర్సింహ్మారెడ్డి, ముదిగొండ రవియాదవ్, మోర శ్రీనివాస్, రవుఫ్, జయవంత్, సుధాకర్ యాదవ్, కొత్త మానిక్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, షాబాద్ ప్రవీన్, పరమేష్ ఉన్నారు.

ఫ్యూచర్ సిటీలో మహేశ్వరాన్ని విలీనం చేయాలి

- ఉద్యమానికి మండల ప్రజలందరూ సహకరించాలి
- 7న మహేశ్వరం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ
- జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి

మహేశ్వరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఫ్యూచర్‌సిటీలో మహేశ్వరం మండలాన్ని విలీనం చేసే వరకు ఉద్యమం ఆగదని జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి, ముఖ్య సలహాదారు కడారి జంగయ్య యాదవ్ హెచ్చరించారు. ఇందులో భాగంగా ఈనెల 7వ తేదీన మహేశ్వరం నుంచి కలెక్టరేట్ వరకు 500 బైకులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం మహేశ్వరంలోని కర్నాటి కళాభవన్‌లో ఏర్పాటు చేసిన జేఏసీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే మండలంలోని తుమ్మలూరు, మొహబ్బత్‌నగర్ గ్రామాలను మాత్రమే ఫ్యూచర్‌సిటీలో విలీనం చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం సరికాదని, మిగితా గ్రామాలను కూడా కలపాలన్నారు. కార్యక్రమంలో కె.జంగయ్య యాదవ్, చంద్రయ్య, కాకి ఈశ్వర్, డి. యాదగిరిరెడ్డి, కె.జగన్‌రెడ్డి, ఎ.రాజునాయక్, బి.నర్సింహ్మాయాదవ్, అంద్యానాయక్, కందిరమేష్, వి. యాదయ్యగౌడ్, అంజనేయులు, దత్తునాయక్, సుభాష్, రాజునాయక్, పాండునాయక్ పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

(ఐదో పేజీ తరువాయి)

చర్యల కోసం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ఫోన్ నంబర్ మొదట పనిచేసేది ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. సాయంత్రం కంట్రోల్ రూం నంబర్ 08416-242136కు కాల్ చేస్తే 'డస్ నాట్ ఎగ్జిస్ట్' అని రావడం గమనార్హం. రాత్రి 8.30 గంటల సమయంలో కాల్ చేయగా, దిస్ నంబర్ డస్‌నాట్ ఎగ్జిస్ట్.. ప్లీజ్ చెక్ ద నంబర్ యు ఆర్ డయల్.. అని రికార్డు వాయిస్ వినిపించింది. అత్యవసర సేవల కోసం ప్రజల నుంచి వచ్చే అభ్యర్థనలపై హుటాహుటిన స్పందించేందుకు పనిచేసే ఫోన్ ఏర్పాటు చేయాల్సిన జిల్లా యంత్రాంగం పని చేయని ఫోన్ నంబర్ ప్రకటించడం గమనార్హం. ఈ విషయమై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తం కావడంతో రాత్రి హుటాహుటిన కంట్రోల్ రూం నంబర్ మార్చి ప్రకటించారు. భారీ వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొనే వారు 7995061192కు కాల్ చేయాలని అధికారులు ప్రకటించారు.

మేడ్చల్ జిల్లాలో పొంగిపొర్లిన నాలాలు..

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో గురువారం సాయంత్రం శామీర్‌పేట, ఘట్‌కేసర్, కీసర మండలాలతో పాటు జీహెచ్ఎంసీ ప్రాంతాల్లోని అల్వాల్, కొంపల్లి, తిరుమలగిరి, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రోడ్లపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.


చేవెళ్లలో కురుస్తున్న వర్షం

వృద్ధుడి దారుణ హత్య

మోమిన్‌పేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలంలోని ఎన్కతల గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు ఓ వృద్ధుడిని హత్య చేశారు. ఎస్ఐ అరవింద్, సీఐ వెంకట్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్కతల గ్రామానికి చెందిన తలారి కిష్టయ్య(72) రెండు కాళ్లు చచ్చుబడిపోయి ఇంట్లో ఉంటున్నాడు. ఆయన భార్య, ఇద్దరు కుమారులు తలారి బస్వరాజ్, నర్సింగ్‌రావు హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. గ్రామంలో ఒంటరిగా ఉంటున్న కిష్టయ్యను గ్రామానికి చెందిన జంగిలి మల్లేశం చూసుకుంటున్నాడు. బుధవారం రాత్రి తలారి కిష్టయ్యకు మల్లేశం అన్నం పెట్టి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం తలారి కిష్టయ్యను అటుగా వెళ్తున్న పాయగాళ్ల అంతయ్య పిలిచినా పలకలేదు. దీంతో జంగిలి మల్లేశం, పాయగాళ్ల అంతయ్య ఇద్దరు కలిసి ఇంట్లోకి వెళ్లి చూడగా తల వెనుక భాగంలో గాయాలు కనిపించాయి. స్థానికుల సమాచారం మేరకు కుమారుడు బస్వరాజ్ గ్రామానికి చేరుకొని తండ్రి మృతదేహాన్ని పరిశీలించాడు. గుర్తు తెలియని వ్యక్తులు తన తండ్రిని ఏదో కారణంతో హత్య చేసి ఉంటారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఎస్ఐ అరవింద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సీఐ వెంకట్ ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

పూడూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం పూడూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులతో కలిసి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మికులకు రెండో పీఆర్సీ వర్తింపజేయడంతోపాటు రూ.18వేల కనీస వేతనం అందజేయాలని, రూ.10లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 19 తర్వాత సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని తెలిపారు. అనంతరం ఎంపీవో సుందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జంగయ్య, నర్సింహులు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అన్నం లేదు.. సిగరెట్ అమ్మం


మాట్లాడుతున్న బాధితులు

అన్నందుకు చెఫ్, హోటల్ యజమానిపై దాడి

ఆపై అతని కూతురు, కొడుకును చితకబాదారు.. మేడ్చల్ పీఎస్ పరిధిలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సిగరేట్, భోజనం కావాలంటూ ఓ యువకుడు హోటల్‌లో చొరబడి వీరంగం సృష్టించాడు. అన్నం లేదని, సిగరెట్లు అమ్మమని చెప్పినా వినకుండా వంటమనిషిని చితకబాదాడు. విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న హోటల్ యజమాని అతడితోపాటు వచ్చిన కూతురు, కొడుకుని విచక్షణారహితంగా బండ రాళ్లతో దాడి చేసి తీవ్ర గాయాల పాలు చేశాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 30న ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో దుర్గాప్రసాద్ (లడ్డు) మండలంలోని సోమారం గ్రామ సమీపంలో రాజేష్ హోటల్ వద్దకు వచ్చాడు. అప్పటికే హోటల్ షట్టర్ వేసి ఉండటంతో బలవంతంగా షట్టర్ లేపి లోపలికి ప్రవేశించి అన్నం పెట్టాలని, సిగరెట్ కావాలని అడిగాడు. వంట మనిషి దివాకర్ సిగరెట్లు అమ్మమని చెప్పడంతో అతడిపై దాడి చేశాడు. దివాకర్ హోటల్ యజమాని రాజేష్‌కు సమాచారం ఇవ్వటంతో అతడు రాత్రి తన కూతురు శివాని, కొడుకు కృష్ణతో కలిసి హోటల్ వద్దకు చేరుకుని దుర్గాప్రసాద్(లడ్డు)ను సముదాయించి అక్కడి నుంచి పంపించారు. అతను సమీపంలోని బండ మైలారం గ్రామానికి వెళ్లి 20 మంది యువకులను తీసుకొచ్చి హోటల్‌పై దాడి చేశాడు. యజమాని రాజేష్, అతని కొడుకు కృష్ణ, వంటమనిషి దివాకర్‌లను చితకబాదుతుండటంతో సముదాయిచడానికి ప్రయత్నించిన శివానిని విచక్షణారహితంగా బండరాయితో తలపై బాదాడు. దీంతో రక్తపు మడుగుల్లో ఆపస్మారక స్థితిలో ఉన్న ఆమెపై పిడి గుద్దులతో దాడి చేశారు. బాధితులు 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వగా పోలీసులు అక్కడికి చేరుకునేలోపే దుండగులు పరారయ్యారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం పోలీసులు మేడ్చల్ పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దుర్గా ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. .

కేసు పెట్టారు.. వదిలేశారు

పోలీసులు దుర్గా ప్రసాద్‌పై కేసు పెట్టి స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలేయటంపై బాధితులు మండి పడ్డారు. బాధితురాలు శివాని మాట్లాడుతూ.. యువతి అన్న కనికరం లేకుండా ఓ ఉన్మాదిలా ప్రవర్తించిన యువకునిపై నామమాత్రపు కేసు పెట్టి స్టేషన్ బేయిల్ ఇచ్చి వదిలేయటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించింది. దాడిలో దుర్గా ప్రసాద్‌తోపాటు బండమైలారం గ్రామానికి చెందిన మరో 20 మంది యువకులు ఉన్నారని తెలిపింది. పూర్తి స్థాయిలో విచారణ జరపకుండా కేవలం ఒక వ్యక్తిపై కేసు పెట్టి పోలీసులు చేతులు దులుపుకున్నారని ఆరోపించింది. తనపై దాడికి పూనుకున్న వారందరిపై పోలీసులు కేసు పెట్టాలని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. మనవత్వం మరిచిన వారిపట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేసింది.

బీజాపూర్ రోడ్డు విస్తరణపై సీఎం స్పందించాలి

- బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం చేవెళ్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ హైవేపై ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. రోడ్డు విస్తరణలో మర్రి చెట్లు తొలగించొద్దని కోర్టుల్లో కేసులు ఉన్నాయని, అందుకే పనులు చేయలేకపోతున్నామని డొంకతిరుగుడు సమాధానం చెప్పడం సరికాదన్నారు. హెచ్‌సీయూలో ఉన్న వేలాది చెట్లను రాత్రికిరాత్రే ఎలా తొలగిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా హైవే విస్తరణపై సీఎం రేవంత్ నోరువిప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, ప్రభాకర్, కర్నె శివప్రసాద్, దేశమోళ్ల ఆంజనేయులు, వంగ శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గోనే కరుణాకర్‌రెడ్డి, చందు, నర్సింలు, ఎల్లయ్య, మల్లేష్, వెంకటేశ్, తోట చంద్రశేఖర్ ఉన్నారు.


ఆరుట్లలో ఎండిన వరిచేలను పరిశీలిస్తున్న భాస్కర్, తదితరులు

మంచాలను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- మాదిగ జేఏసీ నియోజకవర్గ చైర్మన్ భాస్కర్

మంచాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మంచాల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని, ఈ ప్రాంతంలో అధిక శాతం వరి పంటలు నీరు అందక ఎండిపోయాయని మాదిగ జేఏసీ నియోజకవర్గ చైర్మన్ కంబాలపల్లి భాస్కర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో పర్యటించి ఎండిన వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లుగా ఈ ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి కరువు నెలకొందని పేర్కొన్నారు. భూగర్భజలాలు అడుగంటడంతో వేసిన కొద్దిపాటి పంటలు కూడా ఎండిపోతున్నాయని వాపోయారు. సమస్య తీవ్రతను ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. శివన్నగూడ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి ఎత్తిపోతల ద్వారా మంచాల మండలానికి తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు నరేందర్‌గౌడ్, మంద నారాయణరెడ్డి, చెరుకు ఐలయ్య, మల్లారెడ్డి, పున్నంరాజు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, కొండిగారి ప్రవీణ్, జోగు ప్రహ్లద్, మంకు వంశీ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది ఇజ్రాయేలు మరణం తీరనిలోటు

మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్

మహేశ్వరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దళిత సామాజిక వర్గానికి చెందిన న్యాయవాది ఇజ్రాయేలు మరణం తీరని లోటని, అతడిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. హత్యకు గురైన న్యాయవాది ఇజ్రాయేలు దశదిన కర్మ గురువారం తుమ్మలూరు కాకి ఈశ్వర్ పంక్షన్‌హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి వేర్వేరుగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హత్యలకు పాల్పడుతున్న నిందితులకు కఠిన శిక్షలు వేస్తే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. ప్రభుత్వం న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని పటిష్టం చేయాలని కోరారు. ఇజ్రాయేలు ఎప్పుడూ పేద వర్గాలకోసం ఎనలేని పోరాటం చేసే వారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు దేప భాస్కర్ రెడ్డి ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, జంగయ్యయాదవ్, మద్ది కరుణాకర్‌రెడ్డి, రఘుపతి, నర్సింహయాదవ్, రమేష్, చంద్రయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జానారెడ్డి, జంగయ్య, రాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


న్యాయవాది ఇజ్రాయేలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

ఆడుకోవడానికి హన్మకొండ వెళ్లా..

- 24 గంటల్లో బాలిక ఆచూకీ కనుగొన్న పోలీసులు


అదృశ్యమైన బాలికను తల్లికి అప్పగిస్తున్న సీఐ పరశురాం, ఎస్ఐ నర్సింహ, సిబ్బంది

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన బాలిక ధనశ్రీ కథ సుఖాంతమైంది. బుధవారం అదృశ్యమైన బాలిక కేసును ఘట్‌కేసర్ పోలీసులు 24 గంటల్లోనే చేధించారు. సీఐ పందిరి పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం గుంజ రాజశేఖర్, సరస్వతీ కూతురు గుంజ ధనశ్రీ(9) తప్పిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారాలను సేకరించి హన్మకొండలో ఆచూకీ కనుగొని బాలికను ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలికను విచారించగా ఆడుకోవడానికి పిల్లలు ఎవరు లేకపోవడంతో హన్మకొండ పట్టణానికి వెళ్లినట్లు తెలిపింది. ఘట్‌కేసర్‌లో బస్సు ఎక్కి ఆధార్‌కార్డు చూపించి హన్మకొండకు చేరుకుంది. చదువుకోవాలని ఉందని ధనశ్రీకి చెప్పడంతో సీఐ సీడబ్ల్యూసీ(చైల్డ్ వెల్ఫేర్ కమిటీ)కి సమాచారం అందించారు. బాలిక చదువు కోసం అల్వాల్‌లోని సుఖి సెంటర్‌కు అప్పగించారు. బాలికను ఆచూకీ లభించడానికి కృషిచేసిన రాచకొండ ఐటీసెల్ సిబ్బందికి, పోలీసులకు సీఐ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


చేవెళ్ల: ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

హెచ్‌సీయూ భూముల ఆక్రమణను నిలిపివేయాలి

- బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

చేవెళ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల ఆక్రమణను నిలిపివేయాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, బీజేపీ చేవెళ్ల మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్‌సీయూ 400 ఎకరాలు వేల వృక్షాలు, జంతువులు, పక్షులు, కీటకాలకు అవాసంగా ఉందన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రభుత్వమే రాత్రికి రాత్రే ఆక్రమణకు పాల్పడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంచం శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, శ్రీనివాస్, మచ్చేందర్‌రెడ్డి, సత్యనారాయణ, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్, శంకర్ ఉన్నారు.


వికారాబాద్: ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కార్పొరేట్ శక్తులకు అమ్మే కుట్ర

వికారాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల విషయంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షురాలు శిరీష డిమాండ్ చేశారు. గురువారం వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. అటవీ ప్రాంతాన్ని కార్పొరేట్ వ్యవస్థకు అమ్మేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు వివేకానందారెడ్డి, చరణ్ రెడ్డి, సాయి ఉన్నారు.

అర్ధరాత్రి అరెస్టులు


తెల్లవారుజామున అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వికారాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూలో కొనసాగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఛలో సెక్రటేరియట్, ఉమెన్ జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశానికి పిలుపు ఇవ్వడంతో ప్రజా సంఘాల నాయకులను అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో వికారాబాద్ పట్టణంలోని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి గీత, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు మహేందర్‌ను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సుప్రీం కోర్టు స్టే హర్షనీయం

- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల విషయంలో సుప్రీం కోర్టు స్టే ఇవ్వడం హర్షించదగ్గ పరిణామమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంప పెట్టు లాంటిదని, హైడ్రా విషయంలోనూ హైకోర్టు ఎన్నోసార్లు తెలంగాణ ప్రభుత్వాన్ని తప్పు పట్టిందన్నారు. హెచ్‌సీయూ భూముల్లో చెట్ల నరికివేతను తక్షణమే ఆపాలని, సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడం హర్షించదగ్గ పరిణామమన్నారు. ఇది హెచ్‌సీయూ విద్యార్థులు, ప్రొఫెసర్లు, పర్యావరణ ప్రేమికుల విజయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ప్రభుత్వ భూముల అమ్మకాలను ఆపివేయాలని పేర్కొన్నారు.

షాద్‌నగర్‌లో శంకర్‌దాదాలు!

(5వ పేజీ తరువాయి)

వారంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే ఆస్పత్రికి వచ్చి వెళ్తుంటారు. మిగతాదంతా ఆర్‌ఎంపీలే చూసుకుంటారు. ప్రమాదకరమైన చికిత్సలు చేస్తూ రోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవసరం ఉన్నా లేకున్నా వైద్య పరీక్షలు, స్కానింగ్‌లు, ఎంఆర్‌ఐలు, ఖరీదైన మందులు రాసి పేదలను దోచుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. చిన్నపాటి ఫార్మా కంపెనీలు ఆర్‌ఎంపీలతో లింకులు పెట్టుకొని వారి మందుల అమ్మకాలు జరిగేలా ప్రోత్సహిస్తున్నాయి. టార్గెట్‌లను పూర్తి చేసిన ఆర్‌ఎంపీలకు కమిషన్ ఇవ్వడంతో పాటు దేశ, విదేశాలకు టూర్లకు సైతం తీసుకెళ్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ప్రజల ప్రాణాలు గాలిలో...

లోకల్ శంకర్ దాదాల వైద్యంతో చాలామంది ప్రాణాలు గాలిలో కలిసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల పట్టణంలోని పరిగి రోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా రోగి మరణించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. గతంలో కూడా అదే పరిగి రోడ్డులోని మరో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రోగి మృతి చెందిన సంఘటన బంధువుల ఆందోళనకు దారి తీసింది. అదేవిధంగా పాత జాతీయ రహదారిపై గల ఓ చిన్నారుల ఆస్పత్రిలో ఓ బాలిక మృత్యువాత పడింది. ఇవే కాకుండా గుట్టు చప్పుడు కాకుండా పలు ఆస్పత్రుల్లో అబార్షన్లు జరుగుతున్నాయన్న వినికిడి కూడా ఉంది.

అనుమతుల్లేని ఆస్పత్రులు ఎన్నో...

షాద్‌నగర్ నియోజకవర్గంలో అనుమతులున్న ఆస్పత్రులు 32 వరకు ఉన్నాయి. కానీ పర్మిషన్ లేకుండా నడిచే క్లినిక్‌లు మాత్రం గల్లీగల్లీకి ఉన్నాయి. అయితే అనుమతులున్న ఆస్పత్రుల్లో కూడా పూర్తిస్థాయిలో వైద్య పరికరాలు అందుబాటులో ఉండటం లేదు. రోగి పరిస్థితి విషమించితే వెంటనే హైదరాబాద్‌కు తీసుకువెళ్లాలని అంబులెన్స్‌లో తరలిస్తున్నారు. ఇలా చేయడం వల్ల మార్గమధ్యలోనే రోగి మృతిచెందడం, ఆస్పత్రి వద్ద రోగి కుటుంబీకులు ఆందోళనలు చేపట్టడం, వైద్యులపై దాడి చేయడం లాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మృతిచెందిన రోగి కుటుంబీకులకు ఎంతోకొంత పరిహారం ఇచ్చి వారి ఆస్పత్రికి చెడ్డపేరు రాకుండా చూసుకుంటున్నారు.

తూతూ మంత్రంగా తనిఖీలు

వైద్యం వికటించి రోగి మృతి చెందినప్పుడో.. మరే ఇతర సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే వైద్యాధికారులు స్పందిస్తారు. తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి.. పరిస్థితి సీరియస్‌గా ఉంటే ఆస్పత్రులను సీజ్ చేస్తారు. కానీ సీజ్ చేసిన ఆస్పత్రులు కేవలం వారం రోజుల వ్యవధిలోనే తిరిగి ఓపెన్ చేసి ఉంటున్నాయి. ఇందుకిలా జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

ఆర్‌ఎంపీలను నియంత్రించాలి



గ్రామీణ ప్రాంతాల్లో ఉండాల్సిన ఆర్‌ఎంపీలను అర్బన్ ప్రాంతాల్లో అనుమతించవద్దు. వారిని ప్రాథమిక చికిత్సకు మాత్రమే పరిమితం చేయాలి. షాద్‌నగర్ పట్టణంలో 150 మంది వరకు ఆర్‌ఎంపీ క్లినిక్‌లు, ఆస్పత్రులు నడుపుతూ వైద్య దందా నిర్వహిస్తున్నారు. వీరికి ఎవరు అనుమతులు ఇస్తున్నారు. అదేవిధంగా ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేసేందుకు వీరికి ఎవరు అనుమతిచ్చారు. ఇలాంటి పరిస్థితిని కట్టడి చేయాలి.

- డాక్టర్ నాగవర్ధన్‌రెడ్డి, ఐఎంఏ షాద్‌నగర్ అధ్యక్షుడు

అకాల వర్షం.. ఆగమాగం

- శంకర్‌పల్లి మండలం సింగాపూర్‌లో పిడుగుపాటుకు గేదె మృతి.. రైతుకు స్వల్ప గాయాలు
- పలుచోట్ల దెబ్బతిన్న పంటలు



వర్షంలోనే చౌదరిగూడ సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



శంకర్‌పల్లి : పిడుగుపాటుకు మృతి చెందిన గేదె

శంకర్‌పల్లి/శంషాబాద్/కందుకూరు/చేవెళ్ల/మొయినాబాద్ రూరల్/చౌదరిగూడ/యాచారం/షాద్‌నగర్ అర్బన్/ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం మోస్తరు నుంచి భారీగా వర్షం కురిసింది. ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు అకాల వర్షానికి ఉపశమనం కలిగించింది. గురువారం సాయంత్రం నుంచి వర్షం పడుతూనే ఉంది. ఈమేరకు శంకర్‌పల్లి మున్సిపాలిటీ సింగాపూర్‌కు చెందిన రైతు యాబైగూడెం నర్సింహారెడ్డి తన రెండు గేదెలను మేత కోసం పొలానికి తీసుకెళ్ళాడు. మధ్యాహ్నం వర్షపు చినుకులు మొదలుకావడంతో పొలంలోని చెట్టుకు గేదెలను కట్టేసి పక్కనే ఉన్న మరో చెట్టుకింద నిలబడ్డాడు. ఆ తర్వాత ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవగా.. గేదెలు కట్టేసిన చెట్టుపై పిడుగు పడింది. దాంతో ఓ గేదె అక్కడికక్కడే మృతిచెందింది. నర్సింహారెడ్డికి సైతం స్వల్పగాయాలై, కంచిచూపు సరిగా లేక పోవడంతో కుటుంబికులు శంకర్‌పల్లిలోని



యాచారంలో కురుస్తున్న వర్షం

గాయత్రి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. కాగా, స్వల్పంగా గాయాలైన మరో గేదెకు స్థానికంగా ఉండే పశువైద్యుడు చికిత్స అందించారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని వివిధ బస్తీల్లో మోస్తరు వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. బస్టాండు, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడ్డారు. కందుకూరు మండల పరిధిలో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. కొత్తవాడ గ్రామంలో చామగడ్డ పంటలో వర్షపు నీరు నిలిచింది. చేవెళ్ల డివిజన్ పరిధిలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. చేవెళ్ల, షాబాద్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో వర్షం కురిసింది. కొందరు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రైతులు, ప్రజలు చెట్లకింద, పాడుబడిన ఇండ్లలో ఉండకూడదని అధికారులు సూచించారు. కరెంటు స్తంభాలకు దూరంగా ఉండాలని, ఎమర్జెన్సీలో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. జిల్లేడ్ చౌదరిగూడ ,కొందుర్గు మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చౌదరిగూడలో సంతలో సాయంత్రం నాలుగు గంటల నుంచి వర్షం పడుతుండడంతో కూరగాయలు వర్షపు నీటిలో కొట్టుకుపోవడంతో వ్యాపారులు నష్టపోయారు. రోడ్లపైకి భారీగా వరద నీరు ప్రవహించింది. యాచారం మండలంలోని నందివనపర్తి, చౌదర్‌పల్లి, మల్కీజ్‌గూడ, యాచారం తదితర గ్రామాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కాగా, వర్షంతో ఎండుగడ్డి పాడవుతుందని రైతులు తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలో చిరుజల్లులు కురవగా గంటపాటు మోస్తరు వర్షం కురిసింది. ఇబ్రహీంపట్నం టౌన్ సహా మండల పరిధిలో భారీ వర్షం కురిసింది. కాగా, అకాల వర్షాల కారణంగా ఉత్పన్నమైన పరిస్థితులను ఎదుర్కొనేందుకు మహేశ్వరం నియోజకవర్గ అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. ఈమేరకు గురువారం సాయంత్రం కురిసిన వర్షంపై ఆమె పలు సూచనలు చేశారు.

బీసీ బిల్లు పేరుతో డైవర్షన్ రాజకీయాలు

(5వ పేజీ తరువాయి)

చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ నిరుపేద యాదమ్మ కుటుంబం కోసం నిర్మించిన ఇంటిని ఆయన ప్రారంభించారు. బోయిన్‌గుట్ట తండాలో సంత్‌సేవాలాల్, మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం కడ్తాల మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో హరీశ్ మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్ బిల్లు పేరుతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణ తలసరి ఆదాయాన్ని పెంచితే... రేవంత్ గుండాయిజం పెంచి తన కుటుంబ ఆదాయాన్ని పెంచుకున్నాడని ధ్వజమెత్తారు. రేవంత్ వ్యవహార తీరుతో సీఎం కుర్చీకి విలువ తగ్గిపోయిందని విమర్శించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన 400ఎకరాల భూములు అమ్ముకోవడానికేనా నువ్వు సీఎం అయ్యిందని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఏటా రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఏడాదిన్నరలో 5వేల ఉద్యోగాలు ఇచ్చి గ్లోబల్ ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఉద్యోగాల కల్పన, హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు నిరుద్యోగులు, విద్యార్థులు ఉద్యమిస్తే వారిపై పోలీసులచే లాఠీచార్జి చేయిస్తుండడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రీన్ ఫీల్డ్, ట్రిబుల్‌ఆర్ రోడ్డు, ఫోర్త్‌సిటీల పేరుతో పేదల భూములు లాక్కునేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు అసైన్డ్ భూములకు పట్టాలిచ్చి హక్కులు కల్పిస్తామన్న రేవంత్... వారి హక్కులనే కాలరాస్తున్నారని విమర్శించారు. రూ.2లక్షల రుణమాఫీ విషయంలో దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మాట తప్పారని, నేటికీ సగం మందికి కూడ రుణమాఫీ కాలేదని ఆయన ఆరోపించారు. రూ.49వేల కోట్లు రైతుల రుణాలు మాఫీ చేస్తామని రూ.13వేల కోట్లు రైతుబంధు రైతులకు ఎగ్గొట్టి.. 25 శాతం మంది రైతులకు రుణమాఫీ చేశారని ఆరోపించారు. తులం బంగారం, మహిళలకు రూ.2500 నగదు, స్కూటీలు ఇస్తానని గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ.. ప్రజలను మోసగించిందన్నారు. ఎన్నికలకు ముందు రాహుల్ సమక్షంలో పేదలు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చి హక్కులు కల్పిస్తామన్న రేవంత్.. నేటికీ ఇవ్వకపోగా ఫోర్త్‌సిటీ, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, ట్రిబుల్ ఆర్ రోడ్డు, ఫార్మాసిటీపేరుతో పేదల భూములు లాక్కోనేందుకు కుట్ర సాగిస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. అధికారంలోకి వస్తే పింఛన్ రూ.4 వేలు అందిస్తామన్న సీఎ రేవంత్ 16 నెలల్లో రెండు నెలల పింఛన్ రూ.4 వేల చొప్పున ఎగ్గొట్టి ముసలోల్ల ఉసురుపోసుకున్నాడన్నారు. ఒక్క గిరిజనుడికి కూడ మంత్రి వర్గంలో అవకాశం కల్పించలేదని విమర్శించారు. అదేవిధంగా ప్రభుత్వ తీరుతోనే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క రూపాయి నిధులు ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని ఆరోపించారు.

సబితారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. నిత్యం మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, ఊర్కొండ పేటలో మహిళలపై సామూహిక అత్యాచార ఘటన విచారకరమన్నారు. జైపాల్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ దుర్మార్గ పాలన సాగిస్తుందని మండిపడ్డారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జైపాల్ రెడ్డి పేరు పెట్టి ఒక్కరూపాయి కూడా కేటాయించలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, జేఏసీ రాష్ట్ర నాయకుడు కరాటే రాజు, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ జడ్పీటీసీలు ఉప్పల వెంకటేశ్, విజితారెడ్డి, దశరథ్‌నాయక్, అనురాధపత్యానాయక్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు పరమేశ్, అర్జున్‌రావు, జైపాల్ రెడ్డి, విజయ్‌గౌడ్, శంకర్, మాజీ సర్పంచ్‌లు నర్సింహగౌడ్, యాదయ్య, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, నాయకులు భాస్కర్‌రావు, సూర్యప్రకాశ్, సైదులుగౌడ్, సయ్యద్‌ఖలీల్, కడారి రామకృష్ణ, జోగు వీరయ్య, హరిచంద్‌నాయక్, రమేశ్, లచ్చిరామ్, నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్ నాయక్, లాలయ్యగౌడ్, గోపాల్, లాయక్ అలీ, అంజినాయక్, రాజునాయక్, లోకేశ్ పాల్గొన్నారు. కాగా, కందుకూరు మండల కేంద్రం మీదుగా కడ్తాల్ వెళుతున్న మాజీ హరీష్‌రావు, సబితారెడ్డిలకు మండల కేంద్రంలో ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు సురేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. తాళ్ల కార్తీక్, ఎస్.సుదర్శన్‌రెడ్డి, పొట్టి ఆనందర్, సామయ్య, సామ ప్రకాశ్‌రెడ్డి, దీక్షిత్‌రెడ్డి, తాళ్ల సోను, కె.ప్రశాంత్‌చారి, తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కడ్తాల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికి మేలు జరుగుతుందని టీపీసీసీసభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఆయన అన్నారు. కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో రూ.10 లక్షలతో చేపట్టే సీసీరోడ్డు నిర్మాణం పనులను గురువారం ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్ లతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు.పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగిద్దాం



చేవెళ్ల : కొమురయ్య విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల/షాబాద్/మహేశ్వరం/యాచారం/కడ్తాల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగిద్దామని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. కొమురయ్య జయంతి సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఆయన విగ్రహానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ నాయకులతో పాటు వివిధ కుల సంఘాల నాయకులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మండల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, వైస్ ఎంపీపీ శివప్రసాద్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ మండలాధ్యక్షులు ప్రభాకర్, వీరేందర్‌రెడ్డి, అనంతరెడ్డి, చేవెళ్ల మండల కురుమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్లు మల్లేష్, బి.రాములు, బీజేపీ జిల్లా యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, సీనియర్ నాయకులు తదితరులున్నారు. తెలంగాణ చైతన్యపు జ్వాల దొడ్డి కొమురయ్య అని కురుమ సంఘం షాబాద్ మండలాధ్యక్షుడు మద్దూర్ పాండు, బీజేపీ మండలాధ్యక్షుడు మాణయ్య అన్నారు. షాబాద్, కుమ్మరిగూడలో సంఘం నాయకులతో కలిసి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు రమేష్, నరేందర్, తదితరులు న్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరోచితంగా పోరాడిన మహనుభావుడు దొడ్డి కొమురయ్య అని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం మండల కేంద్రలో మండల కురుమసంఘం అధ్యక్షుడు పోల్కం బాలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కొమురయ్య జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు సదానందం, జిల్లా అధ్యక్షుడు దశరథ, నాయకులు రాయప్ప, కుండె వెంకటేష్, రాజునాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, అంబయ్య, చంద్రయ్య, మిద్దింటి బాల్‌రాజ్, రమేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు. కొమురయ్య అమరవీరుడని కురుమ సంఘం యాచారం మండలాధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య అన్నారు. మండల కేంద్రంలో కొమురయ్య జయంతిని ఘనంగా జరుపుకున్నారు. నాయకు లు ప్రభాకర్, మల్లేష్, ఐలయ్య, అనిల్, జంగ య్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు. శంకరపల్లి చౌరస్తాలో కొమురయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు బయానంద్, ప్రభాకర్‌రెడ్డి, రాములు గౌడ్, బీర్ల సురేష్, వాసుదేవ్, సత్తయ్య, ప్రవీణ్, భిక్షపతి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు కడ్తాల మండల కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీల నాయకులు, సంఘాల నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ గీత నర్సింహ, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌లు హాజరయ్యారు. కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

దశరథ్ నాయక్ ఉదారత.. పేదరాలి సొంతింటి కల సాకారం



దశరథ్ నాయక్-శారద దంపతులను సత్కరిస్తున్న హరీశ్‌రావు

కడ్తాల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ తన ఉదారతను మరోమారు చాటుకున్నారు. ఓ నిరుపేద మహిళకు ఇళ్లు కట్టించి గూడు కల్పించారు. గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి ఇంటిని ప్రారంభించి పేదరాలి కుటుంబంలో ఆనందాన్ని నింపారు. కడ్తాల మండలం ముద్విన్‌కు చెందిన షేడ యాదమ్మ భర్త లక్ష్మయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. ఇద్దరు పిల్లలు, అత్తతో కుటుంబ పోషణ ఇబ్బందిగా నెట్టుకొస్తోంది. సొంతిళ్లు లేక ఏళ్లకాలంగా పూరి గుడిసెలో జీవనం సాగిస్తోంది. దశరథ్‌నాయక్ జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం చేయించారు. డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డిలు చెరో రూ.లక్ష సాయమందించారు. దశరథ్‌నాయక్, శారద దంపతులను హరీశ్‌రావు అభినందించారు. మాజీమంత్రి సబితారెడ్డి, రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్‌చైర్మన్ వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ యాదయ్య, ఉపసర్పంచ్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసఫ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

కందుకూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేదునూరులో గల సెయింట్ జోసఫ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిల్లీ శ్రీధర్, భానుప్రసాద్‌లు కోరారు. గురువారం మండల విద్యాధికారి నర్సింహకు ఆ సంఘం నాయకులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. స్కూల్ యాజమాన్యం రాత్రి వేళల్లో వివిధ గ్రామాల్లో తిరుగుతూ తమ స్కూల్లో పిల్లలను చేర్పించాలని ప్రచారం నిర్వహిస్తున్నారని, బుధవారం రాత్రి 8గంటలకు పాఠశాల విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో ప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు.

చలివేంద్రం ప్రారంభం

కేశంపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పల్లె బ్రదర్స్.. ఆనంద్ కుమార్, బాలీశ్వర్‌లు పదేళ్లుగా ప్రజల దాహార్తి తీరుస్తున్నారని మాజీ జడ్పీటీసీ విశాల కొనియాడారు. మండల కేంద్రంలో కొండారెడ్డిపల్లి దివంగత మాజీ సర్పంచ్ పద్మమ్మ-వెంకటయ్యల జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు.

సంక్షిప్తంగా..

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం-అజ్జన తండాల మధ్య అదనంగా బస్సు నడపాలని సీపీఎం ఆధ్వర్యంలో డీఎం వెంకటనర్సప్పకు వినతిపత్రమిచ్చారు. సాయంత్రం 6.30గంటల సమయంలో బస్సు వేయాలని నాయకులు కోరారు.

చౌదరిగూడ : కొందుర్గు మండల గంగన్నగూడ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల సౌకర్యార్థం 14 డెస్క్ బెంచీలను మాజీ సర్పంచ్ శశికళ శేఖర్‌లు అందించారు. హెచ్‌ఎం శిరీష, ఉపాధ్యాయురాలు మానస, కార్యదర్శి సుమలత ఉన్నారు.

కొత్తూర్ : చలో హెచ్‌సీయూ పిలుపు మేరకు స్థానిక ఏబీవీపీ నాయకులు హైదబాద్‌కు తరలివెళ్లకుండా స్థానిక పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఏబీవీపీ మండల కన్వీనర్ నరేష్‌చారి మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను అపలేరన్నారు. ఏబీవీపీ నాయకులు శివకుమార్‌చారి, జగేష్, హర్షయాదవ్, రాజీవ్ తదితరులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

యాచారం : బడీడు పిల్లలందరినీ విధిగా బడికి పంపాలని యాచారం మండల ఇన్‌చార్జి ఎంఈవో పాండురంగారెడ్డి సూచించారు. మంతన్‌గౌరెల్లిలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి.. పోస్టర్లు విడుదల చేశారు.

తలకొండపల్లి : గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రం చేసేందుకు సహకరించాలని గ్రామ జేఏసీ నాయకులు ఎమ్మెల్యే హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిలను కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వారు వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తామని పేర్కొన్నారు. నాయకులు అశోక్, వెంకటయ్య, అంజనేయులు, శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : ఛత్రపతి శివాజీ గొప్ప సాహస వీరుడని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, బీజేవైఎం పార్లమెంట్ కో-కన్వీనర్ రవిరాథోడ్ లు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఛత్రపతి శివాజీ వర్ధంతి విక్రమ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కడ్తాల్ : మైసిగండిలో శివాజీ వర్ధంతి కార్యక్రమానికి పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

మాడ్గుల : కొల్కులపల్లికి చెందిన పడగంటి లక్ష్మయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ భట్టు కిషన్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ.3వేల ఆర్థిక సాయం అందచేశారు.

కడ్తాల్ : ముద్విన్‌లో కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ సమక్షంలో ఎన్నికల అధికారి నాగిరెడ్డి సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా పి.యాదయ్య, ఉపాధ్యక్షుడిగా సి.పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా జె.శ్రీను, సభ్యులుగా డి.యాదయ్య, బి.రాములు ఎన్నికయ్యారు.

క్రైం కార్నర్

రెండు ఆటోలు ఢీ.. మహిళకు గాయాలు

చౌదరిగూడ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ట్రాలీ, ప్యాసింజర్ ఆటోలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ మహిళకు గాయాలైన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం చెన్నారెడ్డిగూడ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలానికి చెందిన లక్ష్మి(30) గురువారం చౌదరిగూడలో జరిగే సంతకు వచ్చి తిరిగి చౌడాపూర్‌కు ఆటోలో వెళ్తుండగా చెన్నారెడ్డిగూడ గ్రామ సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో ఢీకొనడంతో ప్యాసింజర్ ఆటోలో ఉన్న మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె ఎడమ కాలు విరిగింది. స్థానికులు అంబులెన్స్‌లో షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని జింక మృత్యువాత

యాచారం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని కృష్ణజింక మృత్యువాత పడిన ఘటన గురువారం ఉదయం యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చౌదర్‌పల్లి గేటు వద్ద జరిగింది. యాచారం పెట్రో మొబైల్ పోలీసులు గున్‌గల్ వైపు నుంచి యాచారం వస్తున్నారు. ఇంతలో ఓ జింక రోడ్డు దాటుతుండగా యాచారం నుంచి ఇబ్రహీంపట్నం వైపు వెళుతున్న కారు అతివేగంతో వచ్చి జింకను ఢీకొట్టింది. దాంతో జింక తీవ్రంగా గాయపడి మృత్యువాత పడింది. యాచారం పెట్రో మొబైల్ పోలీసులు వెంటనే ఇబ్రహీంపట్నం పోలీసులను అప్రమత్తం చేయడంతో కారుతో పాటు డ్రైవర్ శ్రీశైలంను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అటవీశాఖ రేంజర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకం



షాబాద్ : ఆస్పల్లిగూడలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్

చేవెళ్ల/మొయినాబాద్/శంకర్‌పల్లి/షాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం పంపిణీ పథకం చరిత్రాత్మకమని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. గురువారం చేవెళ్ల మండలంలోని ఊరెళ్ల, మొయినాబాద్ మండలంలోని సురంగల్‌లో ఎమ్మెల్యే రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, ఎం.కృష్ణారెడ్డి, యాదగిరి, ఆగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శంకర్‌పల్లి మున్సిపాలిటీలో లబ్దిదారులకు ఎమ్మెల్యే సన్నబియ్యాన్ని అందజేశారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, డీటీ బాలకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రమోహన్. ప్రవీణ్‌కుమార్, చంద్రమౌళి, వెంకటేష్, పాండు రంగారెడ్డి, రాంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మల్లేషం తదితరులు ఉన్నారు. పేదలకు సన్నబియ్యం పంపిణీ అనేది దేశ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోయే పథకం అని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. షాబాద్ మండలం ఆస్పల్లిగూడలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌లతో కలిసి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఎంపీడీవో అపర్ణ, డీటీ మధు, మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, ఖాజామియాపటేల్, రవీందర్, శ్రీనివాస్‌గౌడ్, లింగం, మహేందర్, జంగయ్య, ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

కేశంపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని షాద్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ చెదురువెల్లి భాస్కర్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లిలో గురువారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పోమాల్‌పల్లిలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నగళ్ల రమేష్‌లు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ అజాంఅలీ, కార్యదర్శులు విజయ్ కుమార్, ధనుంజయ్, శ్రీశైలం, ఖాజాపాషా, శేఖర్, జంగయ్య, ముత్యాలు, రాజేందర్, వీరస్వామి, రామకృష్ణ, పట్నం అరుణ, జంగయ్య, అజహర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఏఎంసీ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

షాబాద్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్తపల్లి లక్ష్మారెడ్డి తల్లి పుష్పమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమేరకు ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌లు తాళ్లపల్లిలో ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.

పెండింగ్ చలాన్లు క్లియర్ చేసుకోవాలి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తమ వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను వెంటనే క్లియర్ చేసుకోవాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్సై ప్రభాకర్ సూచించారు. గురువారం హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి హిమాయత్ నగర్ చౌరస్తా సమీపంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వద్దని, మద్యం తాగి వాహనాలను నడపవద్దని హెచ్చరించారు. తనిఖీలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.15 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధి కొంగరకలాన్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో వండర్‌లా మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో రూ.15లక్షల సీఎస్‌ఆర్ నిధులతో బాలికల కొరకు నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లను గురువారం వండర్‌లా ప్రతినిధులు పారంభించారు. ఈమేరకు పాఠశాల హెచ్‌ఎం బి.రాజేశ్వర్‌రెడ్డి వారిని కృతజ్ఞతలు తెలిపారు. వండర్‌లా ఏజీఎంలు రాంబాబు, రితీష్ మురళి, అసిస్టెంట్ మేనేజర్లు రవీందర్‌రెడ్డి, కీర్తన్, నవనాథ్‌లు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి ఉత్సవాలకు విరాళం



బక్కని నర్సింహులుకు విరాళం ఇస్తున్న యువకులు

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవానికి యువకులు స్పందించి రూ.లక్షా51వేల విరాళం ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో గురువారం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులుకు షాద్‌నగర్‌కు చెందిన గిరిమోని భరత్, కుందన్, కొట్టె ప్రవీణ్, ఇస్నొతి జలందర్, శ్రీశైలంగౌడ్‌లు విరాళం ఇచ్చారు. బక్కని వారిని అభినందించారు. ఆలయ కార్యక్రమాల పర్యవేక్షకులు పరిగి సాయిశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, కానుగు రాంభూపాల్, ప్రధాన పూజారి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు. అలాగే చౌడమ్మగుట్ట అంజనేయస్వామి ఆలయంలో నిర్వహించే ఉత్సవానికి శ్రీసాయి బాలాజీ కాలనీకి చెందిన ఎస్.వీరేందర్‌రెడ్డి-పావని దంపతులు రూ.20వేల విరాళం ఇచ్చారు. పౌల్ట్రీ పారిశ్రామిక వేత్త గూడే వసంత్ రావు రెండు క్వింటాళ్ల బియ్యం వితరణ చేశారు. శ్రీరామనవమి ఉత్సవానికి సహకారం అందిస్తున్న దాతలకు అంజనేయస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ కో-ఆర్డినేటర్ పి.శ్రీశైలంగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.